



# 'ముక్కాలులోనే వుంది మజా'
# అనే సున్తీ కత!

మా బంధువుల ఇళ్లల్లో ఏ పిల్లోడికైనా 'ఖత్నా' (సున్తీ) చేస్తా వుండారని తెలిసిందంటే చాలు మా నాయిన గుండెల్లో దభీమని రాయి పడుతుంది. ఈ సంగతి మా అన్నకి తెలీకుండా దాచిపెట్టడం ఎట్టారా అని ఆయన కిందా మీదా పడతా వుంటాడు.

కానీ మా బంధువుల ఇళ్లల్లో 'ఖత్నా' అంటే మాకు పిలుపులు రాకుండా వుండవు కదా, పిలుపులొచ్చినాయంటే మేమందరం పలావు బోజనాలకి వెళ్లకుండా వుండము కదా.

అప్పుడు సచ్చినట్టుగా మా అన్నకు తెలిసిపోయేది ఖత్నా సంగతి.

యింక చూడాలి మా అన్న చేతిలో మా నాయిన అవస్తలు.

'ఎప్పుడు నాయినా మాక్కూడా ఖత్నా చేయించేది? చెప్పు నాయినా! ఎప్పుడు నాయినా?' అని, నలుగురుండారని కూడా చూడకుండా మా నాయిన యిజ్జత్ తీసేసేవాడు మా అన్న. ఆ దెబ్బకి మా నాయిన తత్తరబిత్తరయ్యి 'చేయిస్తాలేరా. వచ్చే నెల్లో చేయిస్తా. నువ్వుపో' అని, మా అన్నని అణ్ణే వుంచకుండా యివతలికి లాక్కొచ్చేసేవాడు.

మా అన్నకు ఎప్పుడు చూసినా ఎప్పుడు ఖత్నా చేయిస్తారా అని బలే ఆరాటంగా వుండేది. ఎందుకంటే ఖత్నాకు ఎట్టలేదన్నా ఒక జతయినా కొత్త గుడ్డలు కుట్టిస్తారు. కొత్త చెప్పులు కొనిస్తారు. యింక రేపొద్దున ఖత్నా అనంగా యియ్యాల రాత్రికి పలావొండి, కార్యం చేసి, పూల దండలతో పెళ్లికొడుకుల్లాగా ముస్తాబు చేస్తారు. ఆనేక అమ్మలక్కలంతా గందం పూసి, పటపటమని మొటికెలు విరిచేలా దిష్టి తీసి, చేతిలో సదివింపుల డబ్బులు పెడతారు- యాబయ్యో వందో.

యిన్ని లాబాలు వుంటాయి కాబట్టే తొందరగా ఖత్నా చేయించుకొని వాటన్నింటినీ అనుబవించాలని మా అన్నకు ఆశ. (నాకు మాత్రం అంత ఆశ లేదు సామీ. ఖత్నా చేయించుకోవడం వల్ల రక్తం పోయి, పిలకాయలు వేలాడబడుంటారని చెప్పి, దగ్గరి బందువులంతా రోజుకొకరు కోడికూరా ఎముకల షేర్వా పంపిస్తారు కదా... వాటి సంగతి చూసుకుందాములే అనుకుంటా వుండేవాణ్ణి).

అయితే మా అన్నకి కొత్త గుడ్డల ఆశకానీ, నా కోడి కూర ఆశకానీ తీర్చడానికి మా నాయిన కాడ 'దుడ్డు యిల్లే'.

'పెద్దోడికి, రెండోవోడికి, చిన్నోడికి ముగ్గురికీ కలిపి ఒకేసారి గనంగా చేద్దాము ఖత్నా. డబ్బులు రానీండి' అంటా వుండేవాడు మా నాయిన. అయితే అవి ఏమి డబ్బులో ఎప్పుడొస్తాయో చెప్పేవాడు కాదు.

మా నాయినమ్మ చూసిందీ చూసిందీ యింక లాబం లేదనుకొని ఒక రోజు అగ్గిబరాటా అయిపోయింది.

'రే అబయా. నాకు తెలియకడుగుతా... యింకెప్పుడురా నువ్వు పిలకాయలకు ఖత్నా చేయించేది? మీసాలు గెడ్డాలు మొలిచేశాకనా? యిప్పటికే పెద్దోడు పెద్దోడయిపోతా వున్నాడు. యింకా ఆలిస్యమయ్యిందంటే మంగలాయనకాడ పరువు దక్కదురా తండ్రీ' అని మా నాయిన్ను బెదిరించి పార్నూకింది. ఏమనుకున్నాడో ఏమో దెబ్బకు ఖత్నా ముహూర్తం

పెట్టించేశాడు మా నాయిన.

పిలకాయలకు చేస్తున్న తొలి కార్యం కదా బాగా చేద్దాము, సంతోషంగా చేద్దాము అని పాపం మా అమ్మా నాయినా అనుకుంటా వుంటే ఆదిలోనే అలకపాన్పులు షురూ అయిపోయినాయి.

''నీ బార్య మా యింటికి పిలుపులకొచ్చి 'రెండు రోజుల ముందే రండమ్మా' అనకుండా కార్యానికి రండమ్మా అని పిలిచిందిరా. నేను రాను'' అని, మా నాయినతో తకరారుకు దిగింది మా చినత్త.

'నా బర్తను పిలవడానికి నీ బార్యే రావాల్నా? నువు రాలేవా? యిదేనా నువ్విచ్చే మర్యాదా?' అంటా పేచీ పెట్టింది మా రెండో అత్త.

(వీళ్ల కోపానికి అసలు కారణం వేరే. మా ఖత్నాలకు పెత్తనం అంతా మా అమ్మమ్మోళ్లు తీసుకున్నారనీ వీళ్లకి మంట. వీళ్లకే కాదు. కార్యాల్లో పెత్తనాలు యివ్వలేదని యిట్టా గొడవలొచ్చి సమచ్చరాల తరబడి మాటల్లేకుండా పోయిన సందర్బాలు కూడా వుంటాయి మా యిళ్లల్లో).

యీ యిద్దరత్తలు కలిసి, పాపం పుణ్యం ఎరగని మా పెదత్తకు కూడా చాడీలెక్కించేసి మా నాయినకు మనశ్శాంతి లాకుండా చేసేసినారు.

ఎందుకులే గొడవ అని మా నాయినే తగ్గి బతిమిలాడుకుంటే 'వుండు. నీ పని చెప్తామన్నట్టు'గా వచ్చి మా అన్న నోటిలో మట్టి కొట్టినారు.

పాపం వాడు, ముగ్గురత్తలు వస్తారు... మూడు వందలు పెడతారు అని సదివింపుల కోసం ఎదురు చూస్తా వుంటే వీళ్ల ముగ్గురూ వచ్చి యాబై, యాబై, యాబై పెట్టి చేతులు దులిపేసుకున్నారు.

ఆ సదివింపులు చూసి మా అమ్మ యాడ యింతెత్తుకు ఎగురుతుందో అని మా నాయినే 'పోనీ పోనీ' అంటా సర్దేసినాడు.

కార్యం పూర్తయ్యింది. అందరూ పలావులు తిన్నారు. తెల్లారితే ఖత్నా.

తెల్లారింది. మంగలాయన వచ్చినాడు.

మా అన్నకూ నాకూ మా తమ్ముడికీ ఎర్ర పంచెలు కట్టి, పసుపు చొక్కాలు తొడిగింది మా అమ్మ. మంగలాయన కొత్త కుండ తెచ్చి బోర్లించినాడు. యింక దాని మీద కూచొని ఒక్కొక్కరం ఖత్నా చేయించుకోవాలి.

అప్పుడు మొదలయ్యింది మా అమ్మా, నాయినమ్మల ఏడుపు.

'ఏమీ నొప్పుండదులే నాయినలారా. సంబాళించుకోండి' అంటా మాకు దైర్యం చెప్పబోయి, మా కంటే ముందర వాళ్లే ముక్కు-లు చీదతా ఏడుపు మొదలుపెట్టేసినారు. వాళ్ల ఏడుపుకు మా తమ్ముడు దడుసుకొని ఓ అంటా ఏడుపు!

'యిట్టా ఏడ్చినారంటే నా పని అయినట్టే' అని మంగలాయన గమ్మున కూచున్నాడు కత్తి పట్టుకొని. మా నాయినా యింకొంత మంది మొగోళ్లూ అరిచి, ఆడోళ్లని కంట్రోలు చేసినాక కాని ఏడుపులు సద్దుమణగలేదు.

పస్టు మా అన్న కూచున్నాడు కుండ మీద.

'పైకి చూడు... పైకి చూడు' అంటా మా అన్నను సీలింగు తట్టు చూడనిస్తా, సున్నపు గుర్తు పెట్టుకొని ఒక్క- సెకనులో కత్తి తిప్పినాడు మంగలాయన.

అంతే. ఖత్నా అయిపోయింది.

కట్టు కడుతున్నంత సేపూ మా అన్న 'నొప్పి నొప్పి' అంటా తనకలాడతానే వున్నాడు.

మళ్లా నేను. మంగలాయన కత్తి తిప్పంగానే చుర్రుమని తెగిందక్క-డ.

యింక నేను 'అమ్మో... నాయినో' అంటా ఆగిత్యం చేయబోతా వుంటే ఎవరో లటక్క-న నా చేతిలో అయిదురూపాయిల నోటు పెట్టినారు. అంతే. కంట్రోలు అయిపోయినాను.

అందరికంటే సుకమైన పని మా తమ్ముడిదే. వాడి రెండు చేతుల్లో రెండు లడ్లు పెట్టి కూచో పెట్టినాడు మా నాయిన. వాడు లడ్లని చూసుకుంటా కొరుక్కు-ంటా వుండగానే కింద పని కిందే అయిపోయింది.

ఖత్నా అయిన వారం రోజుల్లో మా ముగ్గురు మేనత్తలూ ఏమీ తెచ్చివ్వక పోయినా మా అమ్మమ్మ రెండుసార్లు కోడి కూర పంపించింది. మా పెదమ్మ ఒకసారి తలకాయ కూర పంపించింది. మా జరీనాంటి ఎట్నో తిప్పలు పడి మినప వడలు, సున్నుండలు తెచ్చిచ్చింది. అన్ని తిన్నా మా కట్లు ఆరలా. చెడ్డీ తొడుక్కో-వడం నా వల్లకాలా.

అయినాకానీ బలే బోరుగా వుండాదని చెప్పి ఎనిమిదో రోజు లుంగీ మీదనే మా యిద్యానికేతన్‌కు వెళ్లినాను. అడుగు పెట్టడమే ఆలిశ్యం మా కిలాసులోని సాకలోళ్ల పద్ద (పద్మ) ఎదురుపడి 'ఏం బాయ్. నీకు ఒడుగులు చేసినారంటనే' అనింది- రొంత కూడా సిగ్గులాకుండా నవ్వతా.

'ఆ...ఆ' అంటానే గబుక్కునెళ్లి కిలాసులో కూచున్నాను.

ఒక తట్టు మాల్యాద్రయివోరు పాఠం చెప్తా వుంటే యింకో తట్టు నా పక్కన కూచున్న నాయాళ్లంతా గుసగుసగా కొసెన్లు మొదలుపెట్టినారు.

'ఎంతరా?' అని అడిగినారు.

'ఏంది?' అన్నాను.

'కటింగు?' అన్నారు. 'కొంచిమే' అన్నాను.

'ఆఫా? ఫుల్లా?' అన్నాడొకడు నవ్వతా.

'కొంచిమేరా. చివ్వరుంటుల్లా... ఆ కొంచిం తీసేస్తారన్న మాట' అన్నాను.

'అంటే మేము ఫుల్లోళ్లం నువ్వు ముక్కాలోడివా?' అన్నాడింకొకడు నన్నేడిపిస్తా.

నాకు సిగ్గుసిగ్గుగా అనిపించింది ఆ మాటలకి. బుగ్గలు ఎర్రంగా అయిపోయినాయి. కిలాసు అయిపోంగానే ఏడ్చుకుంటా యింటికొచ్చి పుస్తకాలు విసిరి కొట్టినాను.

'ఏందిరా నాయినా?' అనింది మా నాయినమ్మ గాబరాగా- నొప్పేమైనా పుడతా వుందేమోనని.

'మా యిస్కూల్లో ఎక్కిరిస్తా వున్నారు. నేను ముక్కాలోణ్ణంటా' అన్నాను.

మా నాయినమ్మ గలగలమని నవ్వతా దగ్గరికి తీసుకొనింది నన్ను.

'ఓరి పిచ్చినాయినా. వూరికే తమాషాకి అనుంటారురా. అట్టా పావు కటింగు చేయించు కుంటేనే చాలా మంచిదిరా. బలే మజారా' అనింది నాతో.

ఆ మాటలకు మా అమ్మ కూడా సన్నగా నవ్వి 'మ్మో! అట్టాంటి మాటలా పిల్లోడికి నేర్పేది' అని నన్ను దగ్గరకు తీసుకొనింది.

అవి ఎట్టాంటి మాటలో, అది ఏమి మజానో ఎట్టా తెలిసేది?

